జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 27 5-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06







# వచ్చేది మా ప్రభుత్వమే.. వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం

## పోలీసుల సమక్షంలోనే యథేచ్ఛగా దాడుల పర్వం

- అంబటి, జోగి ఇళ్లపై విధ్వంసకాండ, నిప్పు పెట్టడం దారుణం
- పోలీసుల సమక్షంలోనే యథేచ్ఛగా దాడుల పర్వం
- ఇప్పుడు తప్పులు చేస్తున్న ఎవరినీ వదిలిపెట్టం
- అన్నీ విచారణ చేయిస్తాం.. కోర్టు బోను ఎక్కిస్తాం
- చంద్రబాబు లాంటి దిగజారిన నేత ప్రపంచంలోనే ఉండరు
- సీబీఐ సిట్ చార్జిషీట్‌లో వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి పేర్లు లేవంటే క్లీన్ చిట్ ఇచ్చినట్లే కదా..
- గుంటూరులో అంబటి కుటుంబాన్ని పరామర్శించి భరోసానిచ్చిన వైఎస్ జగన్



గుంటూరు: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చంద్రబాబు జంగిల్ రాజ్‌ను నడుపుతూ ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న చంద్రబాబు ఆరోపణల్లో నిజం లేదని దేశంలోనే ప్రఖ్యాత ల్యాబ్‌లు ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ నిర్ధారిస్తూ రిపోర్టులు ఇచ్చినా.. అదే విషయాన్ని సీబీఐ తన చార్జిషీట్‌లో పొందుపరిచినా.. పాపభీతి లేకుండా, తప్పు ఒప్పుకోకుండా చంద్రబాబు ఎదురు దాడికి దిగుతున్నారని మండిపడ్డారు. చేసిన తప్పులకు లెంపలు వేసుకోవాల్సింది పోయి దీనిపై ప్రశ్నిస్తుంటే భౌతిక దాడులు, విధ్వంసం, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. గుంటూరులో టీడీపీ గూండాల చేతిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిని, కార్యాలయాన్ని బుధవారం వైఎస్ జగన్ పరిశీలించారు. అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం వైఎస్ జగన్ విలేకరులతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు, సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిన తరువాత చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ తమ తప్పులకు లెంపలు వేసుకుని శ్రీవేంకటేశ్వరస్వామివారిని, ప్రజలను క్షమాపణ

- మిగతా 2వ పేజీలో



# కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు?

- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు
- మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం
- బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు

భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?“ అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.ఒకొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు “ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు“ అని రేవంత్ రెడ్డి అన్నారు. “ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లులి, సన్నాసి, దొంగ అయిన నువ్వేలా జాతిపిత అవుతావు?“ అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. “అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది“ అని వ్యాఖ్యానించారు.

2లో

# మిత్ర ద్రోహి' కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావ్ అన్న రాహుల్ గాంధీ.

- మీరే దేశద్రోహులంటూ కేంద్రమంత్రి కౌంటర్
- పార్లమెంటు ఆవరణలో నిరసన తెలుపుతున్న సమయంలో అనూహ్య ఘటన
- ద్రోహి నడుచుకుంటూ వెళుతున్నాడని రాహుల్ గాంధీ వ్యాఖ్య
- మీరు దేశానికి ద్రోహం చేశారంటూ కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు కౌంటర్
- రాహుల్ గాంధీతో కరచాలనానికి నిరాకరణ



# ప్రభుత్వాలు శాశ్వతం కాదు...

- రాజ్యసభలో తొలిసారి ప్రసంగించిన నటుడు, ఎంపీ కమల్ హాసన్
- సినిమా ద్వారానే తాను పార్లమెంటుకు వచ్చానని వెల్లడి
- ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం అశాశ్వతమని వ్యాఖ్య
- ద్రావిడ నేతలు పెరియార్, అన్నాదురైలను గుర్తు చేసుకున్న కమల్
- ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో యువత ఎదగాలని పిలుపు

2లో



# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు...

- వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం
- ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు
- రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం
- బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- 6 జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్

వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రెన్యూర్లు), ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ

2లో





# న్యాయం ఏడుస్తోంది: సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ

- ఈసీపై సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ పిటిషన్
- తన పిటిషన్ పై తానే వాదనలు వినిపించిన మమత
- ఈసీపై తీవ్ర విమర్శలు గుప్పించిన మమత



# తెలంగాణలో సనాతన ధర్మంపై జరిగే దాడులను సహించేది లేదు

- ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని ఆరోపణ
- హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే నోరు మెదపడం లేదని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని విమర్శలు

రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరిగే దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 'విజయ సంకల్ప్' సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపడం లేదని, ఆలయాల భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.

# మిత్ర ద్రోహి' కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావ్ అన్న రాహుల్ గాంధీ..

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి, మాజీ కాంగ్రెస్ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ ప్రాంగణంలో తనను 'దేశద్రోహి' అని సంబోధించిన రాహుల్, ఒక వీధి రౌడీలా ప్రవర్తించారని, తనపై భౌతిక దాడికి కూడా ప్రయత్నించారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో పార్లమెంట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బుధవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం నుంచి వెళ్తున్న సమయంలో సస్పెండైన ఎంపీలతో కలిసి ఉన్న రాహుల్ గాంధీ, తనను చూసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని రవ్‌నీత్ సింగ్ బిట్టు తెలిపారు. "అదిగో దేశద్రోహి వెళ్తున్నాడు. అతని ముఖం చూడండి" అంటూ రాహుల్ గట్టిగా అరిచారని చెప్పారు. అంతటితో ఆగకుండా, "హలో సోదరా, నా దేశద్రోహి మిత్రమా. కంగారు పడకు, నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావులే" అని తనతో అన్నారని బిట్టు వివరించారు. రాహుల్ వ్యాఖ్యలకు తాను తీవ్రంగా ప్రతిస్పందించానని బిట్టు తెలిపారు. "రాహుల్ ఇంకా ఏదో సంస్థానానికి యువరాజుననే అపోహలో ఉన్నట్టున్నారు. నేను ఆయనతో కరచాలనం చేస్తానని అనుకున్నారు. కానీ నేను, 'రాహుల్ జీ, మీరే ఈ దేశానికి శత్రువు. మీరు సైనికులకు వ్యతిరేకి, పార్లమెంటులో ఎప్పుడూ వారికి వ్యతిరేకంగానే మాట్లాడతారు' అని స్పష్టంగా చెప్పాను" అని బిట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తనపై భౌతిక దాడికి యత్నించారని బిట్టు ఆరోపించారు. "నేను కరచాలనం చేసేందుకు నిరాకరించగానే, రాహుల్ నాపైకి దూసుకొచ్చారు. వెంటనే కేసీ వేణుగోపాల్ అడ్డుకుని ఆయన్ను వెనక్కి తీసుకెళ్లారు. వేణుగోపాల్ గనుక అడ్డుకోకపోయి ఉంటే, రాహుల్ నాపై దాడి చేసేవారే. ఒకవేళ దాడి చేసి ఉంటే, నేను కూడా ఊరుకునేవాడిని కాదు" అని బిట్టు హెచ్చరించారు. వీధి రౌడీలు కూడా చేయని పనిని రాహుల్ చేశారని ఆయన మండిపడ్డారు. గాంధీ కుటుంబంపై, కాంగ్రెస్ పార్టీపై కూడా బిట్టు తీవ్ర విమర్శలు చేశారు. "సిక్కుల హంతకులైన గాంధీ కుటుంబ వారసుడితో ఒక సర్దార్ ఎప్పటికీ చేయి కలపడు. కాంగ్రెస్ పార్టీ ఎంతో మంది సిక్కులను చంపింది. గురుద్వారాలను ధ్వంసం చేసింది. వారు ఎప్పటికీ మాకు శత్రువులే" అని అన్నారు. తన తాత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, అయితే ఆయన కీర్తిని చూసి గాంధీ కుటుంబం ఓర్వలేకపోయిందని ఆరోపించారు. పీవీ నరసింహారావు ప్రధాని అయ్యాక గాంధీ కుటుంబ పాలన అంతమైందని, పరిస్థితులు మారాయని గుర్తుచేశారు. ఒక పార్లమెంటేరియన్ అయి ఉండి ఇలాంటి పదజాలం వాడటం, దాడికి యత్నించడం రాహుల్ గాంధీకి తగదని బిట్టు హితవు పలికారు. "ప్రస్తుతం నేను ఉన్న బీజేపీలో ప్రధాని మోదీ, అమిత్ షా నాకు ఎంతో గౌరవం ఇస్తున్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు తావులేదు. ఈ ఘటన పార్లమెంట్ ఆవరణలో జరగడం వల్లే అసలు విషయం అందరికీ తెలిసింది" అని రవ్‌నీత్ సింగ్ బిట్టు వ్యాఖ్యానించారు.

# కేసీఆర్.. నువ్వెలా జాతిపిత అవుతావు?

తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

**స్థానిక నేతపై విమర్శలు, అభివృద్ధి పనులకు శ్రీకారం**

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు శాశ్వతం కాదు...

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (వీచీవీ) అధినేత కమల్ హాసన్ రాజ్యసభలో తన తొలి ప్రసంగంతో ఆకట్టుకున్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. "వివిధ రంగాలకు చెందిన వారు తమ ప్రజల తరఫున మాట్లాడేందుకు ఈ సభలోకి ప్రవేశించడానికి అనేక ద్వారాలు తెరుచుకుంటాయి. నాకు మాత్రం సినిమా ద్వారా ఆ ద్వారం తెరుచుకుంది" అని కమల్ హాసన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు మద్దతిచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెరియార్, సి.ఎన్. అన్నాదురై, మహాత్మా గాంధీ వంటి మహనీయుల ప్రభావం తన ఆలోచనలు, రాజకీయాలపై ఉందని పేర్కొన్నారు. "మా భాష, సంస్కృతి, హక్కులపై ఎలాంటి దాడి జరిగినా ఎదుర్కోవాలని నేర్పిన సి.ఎన్. అన్నాదురై నాకు తమిళాన్ని పరిచయం చేశారు" అని కమల్ గుర్తుచేసుకున్నారు. ప్రజాస్వామ్యంపై మాట్లాడుతూ, "ఈ ప్రజాస్వామ్య రథం భేదాభిప్రాయాలను అధిగమించి ముందుకు సాగాలి కానీ, ప్రజలను అణచివేయకూడదు. దానిని మేము అనుమతించం" అని హెచ్చరించారు. ప్రపంచ చరిత్రలో ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా నిలవలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అందుకు అతీతం కాదని స్పష్టం చేశారు. "పిల్లలు గమనిస్తున్నారు, జెన్-జీ తరం చూస్తోంది. ఎదుగుతున్న ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో పాటు వారిని కూడా ఎదగనివ్వండి.

# వచ్చేది మా ప్రభుత్వమే.. వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కోరాల్సిందిపోయి.. అంతా కూడబలుక్కుని మళ్లీ అవే అబద్ధాలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. తప్పుడు సమాచారాలతో, కులమతాలను రెచ్చగొట్టే విధంగా, అబద్ధాలతో ఫ్లెక్సీలు పెడుతున్నారు. ఇదే చంద్రబాబు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరుతో ఎన్నికలప్పుడు బాండ్లు ఇచ్చి అబద్ధాలతో మోసగించారని మేం కూడా ఫ్లెక్సీలు పెడితే ఒప్పుకుంటారా ఇది హత్యాయత్నం కాదా..? కుట్రలో భాగం కాదా ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే ఐదు కార్లు ధ్వంసం చేశారు. ఇల్లు, ఆఫీసు మొత్తం తగలబెట్టారు. ఇంట్లో అద్దాలు, సామగ్రిని, ఆఫీసులో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఇంట్లో మహిళలు ఉన్నారని కూడా చూడకుండా లోపలికి వచ్చి ధ్వంసం చేశారు. ఇది హత్యాయత్నం కాదా..? పోలీసులు దగ్గరుండి మరీ ఈ కుట్రలో భాగం కాలేదా? పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఈ మాదిరిగా జరిగేదా? ఇక్కడి నుంచి డీజీపీ ఆఫీసు, ఎస్పీ ఆఫీసు కూతవేటు దూరంలోనే ఉన్నాయి. ఎంత మంది డీఎస్పీలు, సీఐలు లేరు..? మంగళగిరిలో పోలీసు బెటాలియన్ కూడా ఉంది. కనీసం ఫోన్ చేస్తే కూడా పోలీసులు స్పందించలేదు. మా పార్టీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ తదితరులు ఇంటెలిజెన్స్ డీజీ, ఎస్పీ, ఐజీ, ఇతర అధికారులు, చీఫ్ సెక్రటరీ ఆఫీసులకు ఫోన్లు చేస్తే స్పందించలేదు. మరి ఇది కుట్రలో భాగంగా కాదా? సాయంత్రం ఐదు గంటల నుంచి ఒంటి గంట దాకా విధ్వంసం చేశారు. ఇది ధర్మమేనా? న్యాయమేనా? ఇంతటితో ఆగకుండా ఆ రాత్రి రాంబాబు అన్నను అరెస్టు చేశారు. చంద్రబాబును తిట్టాడని కేసు పెట్టి అరెస్టు చేశారు. చంద్రబాబుని తిట్టినందుకు రాంబాబును అరెస్టు చేసినప్పుడు.. మరి రాంబాబు ఇంటికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులను హత్య చేయాలని ప్రయత్నించి, ఐదు కార్లను ధ్వంసం చేసి, అద్దాలన్నీ పగలగొట్టి, ఆఫీసుకు నిప్పంటించడం అంతా ఎమ్మెల్యే, ఆమె భర్త సమక్షంలో జరిగితే వారిపీద ఏం యాక్షన్



తీసుకున్నారు? సింపుల్‌గా స్టేషన్ బెయిలిచ్చి పంపేశారు. అంబటి మీడియా సమక్షంలో వివరణ ఇచ్చారు. జరిగిన దానికి క్షమాపణ కూడా కోరారు. అయినా ఆయన ఇంటిపై దాడి చేశారు. అసలు మీరు మనుషులేనా? ఇది జంగిల్‌రాజ్ కాదా? రాంబాబును అక్రమంగా అరెస్టు చేయడమే కాదు.. అర్ధరాత్రి దాటిన తరువాత ఆయన్ను నల్లపాడు స్టేషన్‌లో ముగ్గురు సీఐలు దారుణంగా హింసించి వేధించారు. ఓ మాజీ మంత్రి పట్ల ఆ విధంగా వ్యవహరించడం, టార్చర్ చేయడం ఏం న్యాయం? మరి ఇది జంగిల్‌రాజ్ కాకపోతే మరేమిటి? మాజీ మంత్రి అంబటి రాంబాబు కాపు కులంలో ఒక టైగర్... విలువలున్న వ్యక్తి. అలాంటి వ్యక్తిని తప్పుడు కేసులో అక్రమంగా అరెస్ట్ చేయడమే కాకుండా నల్లపాడు సీఐ వంశీ, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఆయన్ను తీవ్రంగా దూషించి కొట్టారు. ఇదంతా చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? అని అనుమానం కలుగుతోంది. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు.

**జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు...!**

మరుసటి రోజు జోగి రమేష్ ఇంటిపై దాడి! అక్కడా మళ్లీ పోలీసుల సమక్షంలోనే. అక్కడ ఏకంగా పెట్రోల్ బాంబులు. బాటిళ్లలో పెట్రోల్ పోసి వాటిని ఇంట్లోకి విసిరారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐదు గంటల వరకు విధ్వసం సృష్టించారు. దాదాపు 300400 మంది పోగయ్యారు. వారంతా అక్కడికి వచ్చేటప్పుడు పోలీసులు అక్కడే ఉన్నారు. పోలీసుల సమక్షంలో అదంతా జరుగుతున్నా చూస్తుండిపోయారు. పోలీసుల సమక్షంలోనే జోగి రమేష్ ఇంటికి నిప్పంటించారు.

**పోలీసుల సమక్షంలోనే..**

అంతకు ముందు రోజు విడదల రజిని గుడిలో పూజ చేసుకుని వస్తుంటే ఆమెను అడ్డగించి తిట్టారు. దుర్భాషలాడుతూ పోలీసుల సమక్షంలోనే ఆమెపై దాడికి యత్నించారు. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే.. తిరిగి ఆమె మీదే కేసు పెట్టారు. అది కూడా ఏమని? ఆమె గుడికి వెళ్లి వారందరిపై అటాక్ చేయడానికి ప్రయత్నం చేశారని! మాట్లాడటానికి హద్దూ పొద్దూ ఉండాలి! ఇది జంగిల్ రాజ్ కాదా? బొల్లా బ్రహ్మనాయుడు అన్న చేసిన పాపం ఏమిటి..? చంద్రబాబు, ఆయన కుమారుడు, పవన్ కళ్యాణ్‌కు జ్ఞానోదయం కలగాలని కోరుతూ పూజ చేయటానికి ఆయన గుడికి బయలుదేరారు.

# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు...

(మొదటి పేజీ తరువాయి)



రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ-3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ (ాూాఖ×) నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ (ూాూ=) ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణలో సనాతన ధర్మంపై జరిగే దాడులను సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎందరో పోరాడారని అన్నారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు చూస్తోందని అన్నారు. బలహీనవర్గాలకు న్యాయం జరగలేదని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత విధిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ చెల్లించవలసి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,400 కోట్లకు పైగా కేటాయించామని, మూడు హైస్పీడ్ రైల్ రైళ్లను ఇచ్చామని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోందని అన్నారు.

# న్యాయం ఏడుస్తోంది: సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం (ఈసీఐ)పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) వోటర్ లిస్ట్‌పై సవాలు చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్ ముందు వాదనలు జరిగాయి. "న్యాయం తలుపుల వెనక ఏడుస్తోంది" అంటూ మమత గట్టిగా అరిచారు. తాను మాట్లాడేందు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని కోరగా సీజేఐ అంగీకరించారు. 15 నిమిషాల పాటు మాట్లాడే అవకాశం ఇచ్చారు. మమత తన వాదన మొదలు పెడుతూనే ఈసీఐపై మాటల దాడి చేశారు. ఆరు సార్లు లేఖలు రాశాను కానీ ఒక్క స్పందన రాలేదని, ఎక్కడా న్యాయం దొరకడం లేదని ఆరోపించారు. భాషా సమస్యలు, స్పెల్లింగ్ మిస్‌మ్యాచ్‌ల వల్ల మాత్రమే వోటర్లను తొలగించకూడదని వాదించారు. వివాహం తర్వాత ఇంటి పేరు మారిన మహిళల పేర్లను తొలగించారని తెలిపారు. ఆధార్‌ను ఆమోదించకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన అని... ఇతర రాష్ట్రాల్లో డొమిసైల్, కుల సర్టిఫికెట్లు అంగీకరిస్తుంటే బెంగాల్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు 3 నెలల్లో ఎందుకు ఇంత హడావుడి? నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ఎందుకు బెంగాల్‌ను మాత్రమే ఎంచుకున్నారు? అని ప్రశ్నించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల మరణాలకు ా×=తో సంబంధం ఉందని, హార్వెస్టింగ్ సీజన్‌లో 100 మందికి పైగా మరణాలు, హాస్పిటలైజేషన్లు జరిగాయని, అసోంలో ఎందుకు ఇలాంటివి లేవని విమర్శించారు. బెంగాల్‌ను "బుల్డోజ్" చేస్తున్నారని, ప్రజల హక్కులను కాపాడాలని ధర్మాసనాన్ని కోరుతున్నానని అన్నారు. జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, వీఎం పంచోలి బెంచ్ మమతా పిటిషన్ జెన్యూన్ అని అంగీకరించింది. నోటీసులు పంపేటప్పుడు అధికారులు కాస్త సెన్సిబుల్‌గా ఉండాలని ఈసీకి సూచించింది. అమర్త్యా సేన్, జాయ్ గోస్వామి, టీఎంసీ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖులకు నోటీసులు పంపడం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి విచారణ సోమవారానికి



వాయిదా వేసింది. మరోవైపు, మమత కోల్ కతాలోని జోగేశ్ చంద్ర చౌదరి కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టులో సొంతంగా వాదనలు వినిపించడం ఇదే తొలిసారి.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## కాంగ్రెస్‌తోనే కాలనీల అభివృద్ధి

- పదివ వార్డులో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రచారం

**భువనగిరి, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** భువనగిరి పట్టణంలోని 10వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బింగి నరేష్‌ను గెలిపించాలని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డ్ కాలనీ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని తెలిపారు. అభివృద్ధి పనులను కొనసాగించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బింగి నరేష్‌కు హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**వలిగొండ, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** మండల పరిధిలోని లోతుకుంట ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రయిసున్నిసాబేగం తెలిపారు. 6వ తరగతిలో నూతన ప్రవేశాలతో పాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ రుసుము కింద ఓసీలు రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ. 125 చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇతర వివరాలకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- అభ్యర్థుల వ్యయ నిర్వహణపై ప్రత్యేక అవగాహన
- సహాయ జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** మున్సిపల్ సాధారణ ఎన్నికలు - 2026 నేపథ్యంలో చౌటుప్పల్ పురపాలక సంఘంలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ - 2026), ఎన్నికల వ్యయ నిర్వహణపై అవగాహన కల్పించేందుకు బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎం. శ్రీనివాస్ పాల్గొని అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను ఎలా నమోదు చేయాలి, రిజిస్టర్లను ఎలా నిర్వహించాలి, నిబంధనలకు అనుగుణంగా వ్యయాలను ఎలా చూపించాలనే అంశాలపై సమగ్రంగా వివరించారు. మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌తో పాటు ఇతర సమాచార పత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, ఎన్నికల సిబ్బంది, వివిధ వార్డుల అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.



# కోతి వేషగాడు వచ్చె.. వానర మూక పారె!

- వానర సైన్యానికి సర్పంచ్ 'చెక్'
- చింపాంజీ ఆహార్యం.. భయంతో పలాయనం
- గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు
- చింపాంజీ డ్రెస్.. మర్కటాలు ఫాస్ట్‌గా అవుట్
- హాట్ టాపిక్‌గా మారిన లింగరాజుపల్లి
- కోతుల అల్లరికి కామాలే.. చింపాంజీకి జైకొట్టాలే






**వలిగొండ, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని లింగరాజుపల్లి గ్రామం కోతుల బెడద నివారణలో వినూత్న ప్రయోగంతో వార్తల్లో నిలిచింది. గ్రామంలో గత కొంతకాలంగా కోతుల సంచారం పెరిగి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుండటంతో, సమస్యకు పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ బొడిగె లింగస్వామి కొత్త విధానాన్ని అమలు చేశారు. కోతులను తరిమికొట్టేందుకు చింపాంజీ వేషధారణను వినియోగించడం ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గ్రామంలో కోతుల అల్లరి మితిమీరడంతో పంటలకు నష్టం కలగడంతో పాటు ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కోతులు సహజంగానే చింపాంజీలను చూసి భయపడతాయనే లక్షణాన్ని ఆధారంగా చేసుకుని పంచాయతీ సిబ్బందికి ప్రత్యేకంగా చింపాంజీ డ్రెస్‌లు తయారు చేయించి గ్రామ వీధుల్లో సంచరింపజేస్తున్నారు. ఈ వేషధారణను చూసిన వెంటనే కోతులు భయంతో గ్రామ పరిసర ప్రాంతాలకు పారిపోతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ చర్యతో గ్రామంలో కోతుల సంచారం తగ్గుముఖం పట్టిందని స్థానికులు తెలిపారు. కోతులను తరిమికొట్టడంలో ఈ పద్ధతి సమర్థవంతంగా పనిచేస్తోందని వారు పేర్కొంటున్నారు. ఈ వినూత్న ప్రయోగానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ప్రజల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన ఈ విధానం కోతుల సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లింగరాజుపల్లి గ్రామంలో చేపట్టిన ఈ చర్య ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామస్తులు సర్పంచ్ చేపట్టిన వినూత్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## 12వ వార్డులో కాంగ్రెస్ ప్రచార హోరు.. భారీగా పార్టీలో చేరికలు!

- 15 కుటుంబాలకు కండువా కప్పిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య.
- చిరంజీవి యాదవ్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తల ఐక్యత.
- వార్డు ఇన్చార్జుల నేతృత్వంలో శాంతినగర్ లో ఇంటింటి ప్రచారం.

**చౌటుప్పల్, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీ అభ్యర్థి పాక చిరంజీవి యాదవ్ గెలుపు లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వార్డులోని ఉప్పలమ్మ తల్లి దేవాలయంలో 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు శాంతినగర్ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా టీఆర్ఎస్ పార్టీకి చెందిన లక్ష్మి, కవిత, మంగమ్మ, మీనా, సుజాత, కృష్ణమ్మ, లావణ్య, మౌనిక, మహేశ్వరి, వసంత తదితరులు సహా సుమారు 15 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అభ్యర్థి చిరంజీవి యాదవ్ గెలుపు కోసం కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య గౌడ్, సీతారామచంద్రస్వామి దేవాలయం అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి, తిరుపతి రవీందర్, వార్డు ఇన్‌చార్జులు మాధగోని శేఖర్ గౌడ్, బక్క శ్రీనాథ్, మాజీ వార్డు సభ్యుడు ఎస్కే జానీ బాబు, చౌటుప్పల్ మాజీ ఉపసర్పంచ్ పాలడుగు వెంకటేష్ గుప్తా, మాజీ వార్డు సభ్యురాలు బుంగపట్ల భారతమ్మ, బొబ్బిళ్ళ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







## ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

- మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో అదనపు కలెక్టర్ భాస్కరరావు

**భువనగిరి, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** ఎన్నికలలో అత్యంత కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అప్పుడే పోలింగ్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించడం సాధ్యమవుతుందని తెలిపారు. పోలింగ్‌కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకుని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందిందా లేదా అన్నది పరిశీలించాలని సూచించారు. అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వహించారా లేదా అన్న విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించడంతో పాటు పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతి అంశాన్ని గమనిస్తూ ఎప్పటికప్పుడు జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో వివరించిన అంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నీళ్ల బాటిల్ అనుకుని కెమికల్ తాగి వ్యక్తి మృతి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** మంచినీళ్ల బాటిల్ అని భ్రమపడి కెమికల్ తాగడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన చౌటుప్పల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖైతపురం గ్రామానికి చెందిన గుడ్డేటి రవి (43), ఎల్లగిరిలోని ఒక కోళ్ల ఫారంలో కూలీగా పనిచేస్తుంటాడు. మంగళవారం రాత్రి విధులకు వెళ్లిన రవి, బుధవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో నిద్రలేచాడు. పక్కనే ఉన్న వాటర్ బాటిల్‌ను చీకటిలో గమనించకుండా, అందులో ఉన్న 'సర్మోలిన్' అనే కెమికల్‌ను నీళ్లు అనుకుని తాగాడు. కొద్దిసేపటికే కడుపులో తీవ్రమైన మంట రావడంతో సహచర కార్మికులు అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఉదయం 6 గంటలకు మృతి చెందాడు. మృతుని అన్న కుమారుడు లవ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ మాల్ తెలిపారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





# ఎల్లమ్మ సాక్షిగా.. గెలుపు దీక్ష!..

- 13వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల వాణి ప్రచార హోరు
- ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలతో ప్రచారానికి శ్రీకారం
- తల్లిదండ్రుల ఆశీర్వాదంతో ఇంటింటికీ ప్రచారం
- సేవకురాలిగా పనిచేస్తానని బత్తుల వాణి హామీ
- భారీ సంఖ్యలో పాల్గొన్న నాయకులు, మహిళలు, కార్యకర్తలు
- హస్తం నినాదాలతో మార్మోగిన 13వ వార్డు
- ఘన స్వాగతం పలికిన స్థానిక ప్రజలు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 4 (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల సమరం సమీపిస్తున్న నేపథ్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డులో రాజకీయ వాతావరణం వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బత్తుల వాణి విప్లవ కుమార్ గౌడ్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బుధవారం వార్డు పరిధిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి ఓటర్ల నుంచి విశేష స్పందన లభించింది. ప్రచారానికి శ్రీకారం చుట్టే ముందు బత్తుల వాణి తన కులదైవమైన ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలతో కలిసి వార్డులో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, హస్తం గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బత్తుల వాణి మాట్లాడుతూ.. వార్డు ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే పాలకురాలిగా కాకుండా ఇంటి ఆడబిడ్డగా, సేవకురాలిగా అందుబాటులో ఉంటానన్నారు. వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హస్తం నినాదాలతో 13వ వార్డు వీధులు మార్మోగగా, స్థానిక ప్రజలు అభ్యర్థికి ఘన స్వాగతం పలుకుతూ తమ మద్దతును ప్రకటించారు.



# నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

**నేరేడుచర్ల:** నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ నరసింహ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేర నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర పోలీస్ శాఖ నూతనంగా చేపట్టిన ఇంటి వద్ద నుండే ఎఫ్ఐఆర్ అనే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ కేంద్రంలో జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని ముందుగానే పోలింగ్ కేంద్రాలను, వాటి పరిసరాలను పరిశీలించుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ అధికారులతో సమన్వయంగా పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలని సూచించారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పౌరులు ఎన్నికల నియమావళికి కట్టుబడి నడుచుకోవాలని నియమాలు ఉల్లంఘనకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై పోలీసు నిఘా ఉంచాలని కోరారు. మున్సిపల్ వార్డుల ఎన్నికలకు బరిలో ఉన్న అభ్యర్థులు నిబంధనల ప్రకారం ప్రచారం చేసుకోవాలని ప్రజలను ప్రలోభాలకు గురి చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# 9 అంతస్తుల భవనం నుంచి దూకి ముగ్గురు బాలికల ఆత్మహత్య



**కొరియన్ గేమింగ్ యాప్‌నకు బానిసలైన బాలికలు**

**ఘజియాబాద్‌లో విషాద ఘటన**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: సారీ నాన్న. నేను ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాను.. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో 9 అంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు బాలికల్లో ఒకరు రాసిన చివరి మాటలు ఇవి. బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 12, 14, 16 ఏండ్ల వయసున్న ముగ్గురు బాలికల ఆత్మహత్యకు గుర్తుతెలియని కొరియన్ టాస్క్-బేస్డ్ గేమింగ్ యాప్ కారణమని తొలుత వార్తలు వచ్చినప్పటికీ పోలీసులు ఆ తర్వాత గేమింగ్ యాప్ కోణాన్ని కొట్టివేశారు. కొరియన్ సంస్కృతి, కొరియన్ వినోదాన్ని తాము ప్రేమిస్తున్నట్లు ఆ బాలికలు తమ డైరీలో రాసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కొరియన్ సంస్కృతిని తాము ప్రేమిస్తున్నామని, కే-పాప్ సంస్కృతి, కొరియన్ సినిమాలు, కొరియన్ సంగీతం, కొరియన్ షార్ట్ ఫిల్మ్స్, కొరియన్ షోలు, కొరియన్ కథలను తాము ఇష్టపడుతున్నట్లు తమ డైరీలో వారు రాసుకున్నారు. తమ కుమార్తెలు అటువంటి కంటెంట్‌ను చూడడంపై అభ్యంతరం తెలిపిన బాలికల తల్లిదండ్రులు వారి ఫోన్లను లాక్కున్నారని, ఈ కారణంగానే ఆ బాలికలు ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని పోలీసు వర్గాలు తెలిపాయి. బాలికల తండ్రి చేతన్ కుమార్ ఓ సాధారణ కుటుంబీకుడు. రెండు పెళ్లిళ్లు చేసుకున్న అతనికి ఐదుగురు సంతానం. వారంతా ఒకే ఇంట్లో కలసి ఉంటున్నారు. ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు బాలికల్లో ఒకరు మొదటి భార్య కుమార్తె కాగా మిగిలిన ఇద్దరు రెండో భార్య పిల్లలు. మొదటి భార్యకు సంతానం కలగడంలో ఆలస్యం కావడంతో చేతన్ కుమార్ తన భార్య చెల్లెలినే ద్వితీయ వివాహం చేసుకున్నాడు.

**సూసైడ్ నోట్ లభ్యం**

మృతుల గదిలో సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు తెలిపారు. ఏడుస్తున్న ఎమోజీతో ఉన్న ఆ లేఖలో ఈ డైరీలో రాసినవన్నీ నిజాలని, దీన్ని పూర్తిగా చదవాలని నోట్‌లో రాసిన బాలికలు.. రియల్లీ సారీ, సారీ పప్పా అంటూ తమ తండ్రికి క్షమాపణ చెప్పారు. సూసైడ్ నోట్‌ను దర్యాప్తులో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల గదిలో నేలమీద చిందరవందరగా పడి ఉన్న కుటుంబ సభ్యుల ఫొటోలు కూడా పోలీసులకు లభించాయి. అంతేగాక గదిలోని గోడపై నేను చాలా చాలా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాను. నా జీవితం చాలా చాలా ఒంటరిది అన్న రాతలు కూడా కనిపించాయి. తన కుమార్తెలు ఆన్‌లైన్ టాస్క్ బేస్డ్ గేమ్ ఆడుతున్నారని తనకు తెలియదని చేతన్ కుమార్ పోలీసులకు తెలిపారు. నిన్ననే వాళ్లు ఓ టాస్క్‌ని కూడా పూర్తి చేశారని ఆయన వెల్లడించారు. చనిపోవాలన్న టాస్క్ ఇచ్చే గేమ్ గురించి తనకు తెలియదని, వాళ్లు లూడో ఆడుతున్నారని తాను భావించానని ఆయన చెప్పారు. ఆత్మహత్యకు పాల్పడిన బాలికలు కొరియన్ సంస్కృతికి ప్రభావితులైనట్లు డీసీపీ నిమీష్ పాటిల్ తెలిపారు. కొన్ని రోజులుగా కుటుంబ పెద్దలు తమ పిల్లల నుంచి మొబైల్ ఫోన్లు లాగేసుకున్నారని, టాస్కులు లేదా ఆన్‌లైన్ గేమ్ గురించి సమాచారం ఏదీ తమకు లభించలేదని ఆయన చెప్పారు. ఆ బాలికలు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడారా లేదా అన్న విషయాన్ని సైబర్ నిపుణులు నిర్ధారిస్తారని పోలీసులు చెప్పారు.

# పులిపాటి నగర్" లో యుగంధరుడి సందడి!

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి :04 :** పులిపాటి నగర్ లో "యుగంధరుడు" సందడి చేశారు. పులిపాటి నగర్ వాసులతో మమేకమై ఆద్యంతం ఆనందం పంచారు. "డాక్టర్ పులిపాటి వెల్ఫేర్ అసోసియేషన్" కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి మంగళవారం సాయంత్రం తుమ్మల తనయుడు యుగంధర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులోని డాక్టర్ పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. ఈ సందర్భంగా విచ్చేసిన తుమ్మల యుగంధర్ కు పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఘన స్వాగతం లభించింది. పురోహితుల వేద మంత్రాల నడుమ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణ సాక్షిగా పూలవర్షంతో ఆయనను పులిపాటి నగర్ లోకి ఆహ్వానించారు. అలాగే వివిధ మతాధిపతుల సమక్షంలో యుగంధర్ ను ఆశీర్వదించి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గజ మాలతో, శాలువాలతో ఆయనను ఘనంగా సత్కరించి బర్త్ డే కేకును కట్ చేయించారు. పులిపాటి ప్రసాద్ సతీమణి పద్మప్రియ, కుమార్తెలు శ్రీ వైష్ణవి, శ్రీలేఖ్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులు యుగంధర్ ను సాదరంగా ఆహ్వానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో యుగంధర్ పాల్గొని మారేడు చెట్టును నాటి పులిపాటి నగర్ లో తన పుట్టిన రోజు జ్ఞాపకాన్ని పదిలం చేసుకున్నారు.

**మినీ ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన తుమ్మల తనయుడు..**

పులిపాటి నగర్ లో అత్యంత అధునాతన సౌకర్యాలతో నిర్మించిన పులిపాటి టవర్స్ లో అన్ని హంగులతో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్ ను తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ లాంఛనంగా ప్రారంభించారు. సకల వసతులతో నిర్మించిన ఈ మినీ ఫంక్షన్ హాల్ ను తిలకించిన యుగంధర్ మంత్రముగ్ధుడయ్యారు.

అలాగే టవర్స్ లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్ ను ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ



ప్రారంభించారు. ఇక ఓపెన్ జిమ్ ను గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించగా, వాటర్ ప్లాంట్ ను నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, వాకింగ్ ట్రాక్ ను ఖమ్మం నగర డిప్యూటీ మేయర్ జోహారా ఫాతిమా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిరుమామిళ్ల నాగేశ్వరరావు, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు. డాక్టర్ పులిపాటి ప్రసాద్ తో తనకు చిన్ననాటి నుంచే అనుబంధం ఉందని మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ ఉద్ఘాటించారు. తుమ్మలతో అత్యంత సాన్నిహిత్యంగా ఉండే పులిపాటి తానను కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించే వారని తన అనుభవాన్ని పంచుకున్నారు. పులిపాటి నగర్ పేరుతో నిర్మించిన ఈ కాలనీ అభివృద్ధి కోసం ఏర్పాటైన "పులిపాటి వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా యుగంధర్ అభినందించారు. పులిపాటి నగర్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురాగానే పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు. పులిపాటి ప్రసాద్ అనేక రూపాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి వ్యక్తిగత ఆంతరంగికుడిగా పని చేసిన అనుభవం పులిపాటికే దక్కిందని ప్రశంసించారు. ఆ తర్వాత తుమ్మల సహచర్యంతో పార్టీలో అనేక పదవులు ఎంతో నిబద్ధతగా నిర్వహించారని గుర్తు చేశారు. ఈ క్రమంలో పులిపాటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

**అవార్డుల ఘనాపాటి మన పులిపాటి...**

దేశ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో సహా అనేక మంది ప్రముఖుల చేత అవార్డులను పొందిన ఘనాపాటి మన పులిపాటి ప్రసాద్ అని ఖమ్మం నగర మేయర్ కునుకొల్లు నీరజ అభినందించారు. కళాశాలల నిర్వహణతో పాటు మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పులిపాటి ప్రజలకు మరింత చేరువయ్యారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆయన చేపట్టే సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు .

**పులిపాటి రాజకీయంగా ఎన్నో కష్టనష్టాలను చవిచూశారు..**

డాక్టర్ పులిపాటి ప్రసాద్ రాజకీయంగా ఎన్నో కష్ట నష్టాలను చవి చూశారని టీజీవో రాష్ట్ర నేత ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీఆర్ వద్ద పని చేసిన అనుభవం కలిగిన పులిపాటి ఆ తర్వాత ఎన్నో ఒడిదుడుకులను చవి చూశారని గుర్తు చేశారు. తనకు ఎంతో కాలంగా ఆయనతో సాన్నిహిత్యం ఉందని, తను రాజకీయంగా పడిన ఇబ్బందులను గమనిస్తూ ఉండేవాడినని తెలిపారు. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో పులిపాటిని రాజకీయంగా ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని వివరించారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





# గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి వెనుకబడింది

**కుత్బుల్లాపూర్, :** మేడ్చల్ నియోజకవర్గం, అలియాబాద్ మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్‌మల్కాజ్‌గిరి పార్లమెంటరీ ఇంచార్జి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రచారనికి వచ్చిన సందర్బంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రశ్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ కొలన్ హన్మంత్ రెడ్డి మంత్రి కి ఘన స్వాగతం పలికారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో కాంగ్రెస్ పార్టీ జెండాలతో వీధులు మార్మోగిపోయాయి. ప్రజల నుంచి వెల్లువెత్తిన మద్దతు కాంగ్రెస్ పార్టీపై ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి వెనుకబడిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రైతులు, కార్మికులు, మహిళలు, యువతకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయని, దీనిని కార్యకర్తలు ప్రతి గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, అలియాబాద్, మూడు చింతలపల్లి ఎల్లంపేట్, మున్సిపాలిటీల పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ఎన్నికలు కేవలం మున్సిపల్ ఎన్నికలు మాత్రమే కాదని, ప్రజల పక్షాన నిలిచే కాంగ్రెస్ పార్టీకి ప్రజా వ్యతిరేక శక్తులకు మధ్య జరుగుతున్న పోరాటమని అన్నారు. అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీల చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని, నిజమైన అభివృద్ధి పాలనకు నాంది పలకాలని కార్యకర్తలకు మంత్రి గట్టి పిలుపునిచ్చారు.

## 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్: భట్టి

**హైదరాబాద్,:** ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న గద్దర్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సప్రతిభ, పారదర్శకతలే ప్రమాణికంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గతంలో జ్యూరీ అవార్డుల ఎంపిక గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిశోర్‌బాబు, సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



# దివాలా తీసిన కంపెనీకి 6 వేల కోట్ల కాంట్రాక్టులు : కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బినామీ కంపెనీకి వేల కోట్ల ప్రజాధనం దోచిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. గతంలోనే దివాలా తీసిన కేఎల్ఎస్ఆర్ కంపెనీకి రూ.6,000 కోట్ల విలువైన కాంట్రాక్టులు కట్టబెట్టారని మండిపడ్డారు. సిబ్బందికి వేతనాలు చెల్లించడానికి కూడా డబ్బుల్లేక దివాలా తీసిన ఈ కంపెనీకి సుప్రీంకోర్టు గత నెల 23న నోటీసులు ఇచ్చిందని బయటపెట్టారు. ఆ సంస్థ వ్యవహారాలపై విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి, సీబీఐ, ఈడీ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ ఏజెన్సీలు, కేంద్రానికి కూడా సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిందని సంచలన విషయాలను వెల్లడించారు. తన బినామీ కంపెనీకి సుప్రీంకోర్టు నోటీసులిచ్చిన అంశాన్ని దాచి ఉంచేందుకే సిట్ నోటీసుల పేరుతో దావోస్ నుంచి రేవంత్‌రెడ్డి డ్రామాలాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి బినామీ కంపెనీ అయిన కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిన నాటి నుంచి వరుసగా మాజీ మంత్రి హరీశ్, తనకు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా సిట్ నోటీసులు పంపి విచారణ పేరుతో డైవర్ట్ పాలిటిక్స్ చేశారని విమర్శించారు. వెంటనే కేఎల్ఎస్ఆర్ కంపెనీపై విచారణ ప్రారంభించాలని, అప్పటిదాకా ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపివేయాలని, దాన్ని బ్లాక్ లిస్ట్ చేసి ఇప్పటివరకు ఇచ్చిన కాంట్రాక్టులన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

### రేవంత్‌రెడ్డి బినామీ చీఫ్ మినిస్టర్

'రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. ఆయన బినామీ చీఫ్ మినిస్టర్' అని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. 'వారం పదిరోజులుగా వరుసగా మొదట హరీశ్‌రావును తర్వాత నన్ను, అనంతరం రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావు, అటు తర్వాత మా అధినాయకుడు కేసీఆర్‌ను విచారణకు పిలిపిస్తే మాకు అనుమానం వచ్చింది. ఈ డైవర్షన్ గేమ్ సీరియస్‌గానే అడుతున్నరు.. ఇంతకీ ఎందుకు ఆడుతున్నరని, ఇంత హడావుడిగా ఎందుకు చేస్తున్నరని మాకు డౌట్ వచ్చింది. మేం కూడా తవ్వడం మొదలుపెట్టాం. ఎందుకోసం ఈ కవర్ డ్రైవ్‌లు, ఎక్స్‌ట్రా కవర్ డ్రైవ్‌లు అని జాగ్రత్తగా ఆలోచిస్తే మాకు ముఖ్యమంత్రి పెద్ద బినామీ బాగోతం ఒకటి బయటపడ్డది. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది' అని వివరించారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ సీఎం రేవంత్‌రెడ్డి బినామీ అని విమర్శించారు. ఆ బాగోతం నుంచి డైవర్ట్ చేసేందుకే తమకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. రేవంత్ వాడుతున్న టీఎస్ ఓ7ఎఫ్ ఎఫ్ 0009 నంబర్ ల్యాండ్ క్రూజర్ బ్లాక్ కారు ఈ కంపెనీ పేరు మీదే ఉన్నదని చెప్పారు. ఇది రేవంత్ ముఖ్యమంత్రి కాకముందు తిరిగిన కారు అని, రెండున్నర కోట్లు విలువ చేసే లాండ్ క్రూజర్‌ను కేఎల్ఎస్ఆర్ కంపెనీ రేవంత్‌రెడ్డికి ఎందుకు కొనిచ్చిందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి చెందిన భూపాల్ ఇన్‌ఫ్రా కంపెనీలోకి కేఎల్ఆస్ఆర్ నుంచి డబ్బులు పెద్ద ఎత్తున వస్తున్నాయని, రియల్ ఎస్టేట్ డీల్ చేస్తున్నట్టు ఐటీవాళ్లు చెప్పారని వివరించారు.

### బినామీ కంపెనీల మాస్టర్ రేవంత్

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు బినామీ కంపెనీల మాస్టర్‌గా పనిచేశారని కేటీఆర్ విమర్శించారు. '2018లోనే ఈ కంపెనీపై, రేవంత్‌రెడ్డి బంధువులపై ఐటీ రైడ్స్ జరిగాయి. సాయి మౌర్య ఎస్టేట్స్ అనే కంపెనీ, కేఎల్ఎస్ఆర్ కంపెనీ మధ్య పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారిన విషయాన్ని, ట్యాక్స్ ఎగవేతలను రైడ్స్ సందర్భంగా గుర్తించారు. భూపాల్ ఇన్‌ఫ్రా, సాయి మౌర్య కంపెనీల డబ్బులు ఖాతాల్లోకి వచ్చాయి. ఈ రెండు కంపెనీలు రేవంత్‌రెడ్డి బంధువుల కంపెనీలే అన్న విషయాన్ని గుర్తించారు. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా అనేది బినామీ కంపెనీ అని అందరికీ తెలుసు. 2023లోనే ఈ కంపెనీ దివాలా తీసింది. అలాంటి కంపెనీకి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అనేక ప్రాజెక్టులు కట్టబెట్టారు. దివాలా తీసిన కంపెనీకి రూ.6 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇవ్వడం ఏంటి?' అని ప్రశ్నించారు. ఈ కంపెనీకి కాంట్రాక్టులు ఎందుకు ఇచ్చారని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చిందని గుర్తుచేశారు. ఈ కంపెనీ అవకతవకలపై దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని, జనవరి 23న సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు.

### జడ్జిపై ఒత్తిడి తెచ్చింది రేవంత్‌రెడ్డే

2023 జూలైలో కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీకి, ఏఎస్ఎంఈటీ అనే కంపెనీ మధ్య గొడవ జరిగిందని, వారిద్దరూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వద్దకు వెళ్లారని, ఆ కేసు నడుస్తున్నదని కేటీఆర్ తెలిపారు. ఆ తర్వాత ఈ కేఎల్ఎస్ఆర్ కంపెనీ అకడ కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ పిటిషన్ వేసి తాము దివాలా తీసిన విషయాన్ని స్పష్టంగా చెప్పిందని, దాంతో ఈ కంపెనీలో ఆర్థిక లావాదేవీలను ఎన్‌సీఎల్‌టీ నిషేధించిందని గుర్తుచేశారు. అయితే ఎన్‌సీఎల్‌టీలో జరుగుతున్న ఈ కేసు విషయంలో జస్టిస్ శరత్‌కుమార్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తే, ఆయన ఆ విషయాన్ని బయటపెట్టి ఆ కేసు నుంచి తప్పుకొన్నారని తెలిపారు. ఎన్‌సీఎల్‌టీలోనూ జడ్జిల ద్వారా కంపెనీకి సానుకూలంగా తీర్పు వచ్చేలా నిలబడిన వ్యక్తి ముమ్మాటికీ రేవంత్‌రెడ్డి అని చెప్పారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీలో రేవంత్‌రెడ్డి అనేక పెట్టుబడులు పెట్టారని, అందుకే రేవంత్‌రెడ్డి బావమరిదికి సంబంధించిన సాయి మౌర్య అనే కంపెనీతో లావాదేవీలు నడిపిందని చెప్పారు. కేఎల్ఎస్ఆర్ అనే కం పెనీ ద్వారా సాయి మౌర్య అనే కంపెనీలోకి డబ్బులు పంపి దాన్నుంచి భారీగా భూముల కొనుగోలు చేపట్టిందని పేర్కొన్నారు. 2018లోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వాళ్లు కూడా ఈ కంపెనీ మీద దాడి చేసి అనేక ఆధారాలు బయటపెట్టారని గుర్తుచేశారు. 'కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ అక్రమ కాంట్రాక్టుల వ్యవహారంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సత్వరమే స్పందించాలి. రేవంత్‌ను బీజేపీ కాపాడుతున్నది నిజంకాకుంటే సీబీఐతో విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ దిశగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. మొత్తం వ్యవహారం కేవలం అవకతవకలు, ఆర్థిక కుం భకోణం, క్రిమినల్ కుట్ర, అధికార దుర్వినియోగం మాత్రమే కాదని, మనీ లాండరింగ్ జరిగిందని వివరించారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి పాత్ర ఉన్నదని విమర్శించారు. సింగరేణి టెండర్ల కుంభకోణం విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు లేవని తప్పించుకున్న కిషన్‌రెడ్డి..ఇప్పుడు సుప్రీంకోర్టే ఆదేశించినందున కేఎల్ఆర్ఎస్ స్కామ్, ముఖ్యమంత్రి పాత్రపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్రం విచారణకు ఆదేశించేలా కిషన్‌రెడ్డి చొరవచూపాలని లేదంటే రెండు పార్టీలు కుమ్మక్కయినట్టు ప్రజలు భావిస్తారని తేల్చిచెప్పారు.

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం

అన్ని ఆధారాలు ఉన్నా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ వెనుకడుగు వేయడం దురదృష్టకరమని కేటీఆర్ వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ ఒత్తిడితోనే ఆయన కండ్లకు గంతలు కట్టుకున్న గాంధారిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏదేమైనా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేదాకా బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేస్తుందని ప్రకటించారు. ఈ అంశంలో తప్పకుండా విజయం సాధిస్తామనే నమ్మకం ఉన్నదని చెప్పారు.

### కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ అక్రమ

కాంట్రాక్టుల వ్యవహారంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సత్వరమే స్పందించాలి. రేవంత్‌ను బీజేపీ కాపాడుతున్నది నిజం కాకుంటే సీబీఐతో విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలి. సింగరేణి టెండర్ల కుంభకోణం విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు లేవని తప్పించుకున్న కిషన్‌రెడ్డి..ఇప్పుడు సుప్రీంకోర్టే ఆదేశించినందున కేఎల్ఎస్ఆర్ స్కామ్, ముఖ్యమంత్రి పాత్రపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలి.

### కంపెనీపై 2018లోనే ఈడీ, ఐటీ దాడులు

కేఎల్ఎస్ఆర్ కంపెనీకి, రేవంత్‌రెడ్డికి ఉన్న ఆర్థిక లావాదేవీలు, అనుబంధం, సీఎం అయ్యాక కంపెనీకి చేసిన అనుచిత లబ్ధి, కట్టబెట్టిన వేలకోట్ల రూపాయల కాంట్రాక్టుల ఆధారాలు, ఫొటోలు, ఆంగ్ల మాధ్యమాల్లో వచ్చిన న్యూస్ క్లిప్పింగ్‌లను ఈ సందర్భంగా మీడియాకు కేటీఆర్ చూపించారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ పేరిట కొనుగోలు చేసిన ల్యాండ్ క్రూజర్ బ్లాక్ కారును సీఎం అయ్యాక కూడా రేవంత్‌రెడ్డి వాడుకున్నారని తెలిపారు. అందుకు సంబంధించిన ఫొటోను మీడియాకు చూపించారు. ఈ కేఎల్ఎస్ఆర్ కంపెనీపై 2018లోనే ఈడీ, ఇన్‌కమ్ టాక్స్ దాడులు చేసిందని, అప్పుడే పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న రేవంత్‌రెడ్డికి ఈ కంపెనీకి ఉన్న సంబంధాల గురించి మీడియా బయటపెట్టిందని గుర్తుచేశారు. పూర్తిగా దివాలా తీసి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో దివాలా ప్రక్రియ కేసు నడుస్తున్న క్రమంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి.. ఆ కంపెనీకి అడ్డగోలుగా రూ.6,000 కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టారని వివరించారు. కాంట్రాక్టులకు సంబంధించిన పనుల జాబితాను చదివి వినిపించారు.

### ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి

ఇంత దుర్మార్గ, నీచమైన చరిత్ర ఉన్న కేఎల్ఎస్ఆర్ కంపెనీకి రేవంత్‌రెడ్డి పాలనలో రూ.6,000 కోట్ల ప్రాజెక్టులు వచ్చాయని కేటీఆర్ విమర్శించారు. అమృత్ సీమ్, జల్ జీవన్ మిషన్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ సూల్స్, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల పనులన్నీ కలిపి సుమారు రూ.6,000 కోట్ల కాంట్రాక్ట్‌ను ఈ కంపెనీ ఎలా పొందిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని పురపాలక శాఖతోపాటు సీఎం నియోజకవర్గంలో ఈ కంపెనీ భారీగా పనులు దకించుకున్నదని తెలిపారు. 2023 నుంచే దివాలా తీసిన కంపెనీకి 2024-26 సంవత్సరాల్లో ఏ విధంగా తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టులు ఇచ్చిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేఎల్ఎస్ఆర్ కంపెనీ తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి రూ.15 లక్షలు కూడా లేవని బ్యాంకుల నుంచి అప్పు తీసుకున్నదని, అంతటి ఆర్థిక వనరుల్లేని కంపెనీకి వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులకు సంబంధించిన వందల కోట్ల బ్యాంక్ గ్యారెంటీలను ఎందుకు, ఎలా సబ్మిట్ చేస్తుందనే విషయాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని గుర్తుచేశారు.

# మోదీని చుట్టుముట్టిన మహిళా ఎంపీలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: విపక్ష మహిళా ఎంపీలు బుధవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీతోసహా అధికార పక్ష ఎంపీల సీట్లను అడ్డుగా నిలుచోవడంతో సభలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడవలసి ఉన్న ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది. 8 మంది విపక్ష ఎంపీలను మంగళవారం సస్పెండ్ చేయడం, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణేకి చెందిన అముద్రిత పుస్తకం నుంచి చైనాకు సంబంధించిన కొన్ని అంశాలను ఉటంకించడానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌సహా విపక్ష పార్టీల ఎంపీలు బుధవారం లోక్‌సభలో అలజడి సృష్టించారు. వాయిదా అనంతరం సాయంత్రం 5 గంటలకు సభా కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కాగానే ప్రధాని మోదీ ఇక ప్రసంగిస్తారని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా వర్షా గైక్వాడ్, జ్యోతిమణిసహా విపక్షానికి చెందిన కొందరు మహిళా ఎంపీలు మోదీతోసహా అధికార పక్షానికి చెందిన ఎంపీల సీట్లను అడ్డుకున్నారు. 'ఏది సరైనదో అదే చేయండి' అన్న అక్షరాలు రాసిన పెద్ద బ్యానర్‌ను పట్టుకుని వారు నిరసన తెలిపారు. 8 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను వారు తీవ్రంగా ఖండించారు.

## మేడారంలో గ్యాంగ్‌రేప్‌పై మహిళా కమిషన్ విచారణ సుమోటోగా కేసు స్వీకరణ

ములుగు:మేడారం జాతరలో సామూహిక లైంగికదాడి జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) స్పందించింది. ఆ ఘటనను విచారణకు సుమోటోగా స్వీకరించి విచారణకు ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ అంశాన్ని అత్యంత తీవ్రమైనదిగా భావిస్తున్నట్టు జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయా రాహత్కర్ పేర్కొన్నారు. ఎన్సీడబ్ల్యూ సభ్యురాలు డెలినా ఖోంగ్డప్ కమిటీకి అధ్యక్షత వహించనున్నారు. సీనియర్ కోఆర్డినేటర్ కంచన్ ఖట్టర్ కమిటీ సభ్యురాలిగా వ్యవహరించనున్నారు. అదనంగా ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించే ఒక న్యాయవాది ఈ కమిటీకి సహకరించనున్నారు. విచారణ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఘటన, గురిం చి, అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలను సమీక్షించడం, విచారించి, వాస్తవాలను నిర్ధారించేందుకు కమిటీ ప్రయత్నించనున్నది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను సూచించడం వంటి బాధ్యతలను కూడా కమిటీకి అప్పగించారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




# మీనా కూతురు నైనిక ఫొటో వైరల్

సీనియర్ నటి మీనా తన వ్యక్తిగత జీవితం విషయంలో, ముఖ్యంగా తన కూతురు నైనిక ప్రైవసీ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటారో అభిమానులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలనటిగా 'తేరి' (తెలుగులో పోలీసోడు) సినిమాతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న నైనిక, ఆ తర్వాత వెండితెరపై చాలా అరుదుగా మాత్రమే కనిపించింది. తన కూతురు సాధారణ జీవితం గడపాలని, చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని మీనా తీసుకున్న నిర్ణయమే దీనికి కారణం. ఇంతటి జాగ్రత్తలు తీసుకుంటున్న సమయంలో, తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఫొటో మీనా అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. క్రిస్మస్ సందర్భంగా మీనా పక్కన నైనిక నిలబడి ఉన్నట్లు కనిపిస్తున్న ఆ ఫొటో నెట్టింట విస్తృతంగా షేర్ అవుతోంది. దీంతో "ఇన్ని రోజులు బయటకు రానివ్వని నైనిక ఫొటో ఇప్పుడు ఎలా లీక్ అయ్యింది?" అనే సందేహాలు మొదలయ్యాయి. నిశితంగా పరిశీలిస్తే, ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫొటో ఒరిజినల్ కాదని, అది పూర్తిగా ఎడిట్ చేసిన ఫేక్ పిక్ అని స్పష్టమవుతోంది. మీనా విడిగా దిగిన ఒక తాజా ఫొటోను, నైనికకు సంబంధించిన పాత ఫొటోతో కలిపి ఎవరో కావాలని ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరి హెయిర్ స్టైల్, లైటింగ్, ఫొటో క్వాలిటీ తేడాగా ఉండటం వల్ల ఇది ఫేక్ అన్న విషయం ఇట్టే అర్థమవుతోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆ ఫొటోను షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నైనికదని చెప్పుకుంటున్నా, అది నిజమైన అకౌంటా? ఫేక్ అకౌంటా? అన్న దానిపై కూడా స్పష్టత లేదు. మీనా స్వయంగా బాలనటిగా కెరీర్ ప్రారంభించిన వ్యక్తి. షూటింగ్‌లు, సినిమా వాతావరణం కారణంగా తన బాల్యాన్ని, చదువును పూర్తిగా ఆస్వాదించలేకపోయానని ఆమె పలుమార్లు చెప్పుకొచ్చారు. అదే పరిస్థితి తన కూతురికి రాకూడదనే గట్టి నిర్ణయంతోనే నైనికను మీడియా, సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతున్నారు. నైనిక పుట్టినరోజులకైనా, ప్రత్యేక సందర్భాల్లోనైనా మీనా షేర్ చేసే ఫొటోలు అన్నీ పాతవే తప్ప, తాజా ఫోటోలు ఎప్పుడూ బయటపెట్టలేదు. ఇటీవల ఒక పెళ్లి వేడుకలో తీసిన గ్రూప్ ఫోటోలో మాత్రమే నైనిక కనిపించింది కానీ, సోలో ఫోటోలు మాత్రం ఎక్కడా విడుదల కాలేదు.

# కాలంతో ప్రయాణం



ఈ ఏడాది తెలుగులో 'ఓజీ' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకుంది కన్నడ భామ ప్రియాంక మోహన్. ప్రస్తుతం ఆమె దక్షిణాదిన భారీ ప్రాజెక్ట్‌తో బిజీగా ఉంది. తాజాగా ఈ సొగసరి కన్నడ చిత్రం '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'లో భాగమైంది. ధనంజయ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి హేమంత్ ఎం రావు దర్శకుడు. శివరాజ్‌కుమార్ కీలక పాత్రధారి. శనివారం ఈ సినిమా నుంచి ప్రియాంక మోహన్ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ఆమె వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నది. టైమ్‌ట్రావెల్ కథాంశమిదని, ప్రేక్షకుల్ని సరికొత్త ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, ప్రియాంక మోహన్ పాత్ర భిన్న కోణాల్లో సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే మూడు షెడ్యూల్స్ పూర్తయ్యాయని, తెలుగు, కన్నడ భాషల్లో భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత వైశాక్ జె గౌడ తెలిపారు. ఈ చిత్రానికి చరణ్‌రాజ్ స్వరకర్త.



# అప్పటి ప్రేమలే గొప్పవి..

90ల నాటి ప్రేమలే ఎంతో గొప్పవనీ, వాటినే తాను బలంగా నమ్ముతానని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే. నేటితరం ఫాలో అవుతున్న డేటింగ్ ట్రెండ్స్, ఆధునిక హుక్అప్ సంస్కృతికి తాను పూర్తిగా వ్యతిరేకమని చెబుతున్నది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వ్యక్తిగత జీవితం, ఫ్యామిలీ వ్యాల్యూస్ గురించి తన అభిప్రాయాలను పంచుకున్నది. తాను కుటుంబానికి, ఫ్యామిలీ ఎమోషన్స్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించింది. "నేను నా కుటుంబాన్ని ఎంతో ప్రేమిస్తున్నా. నా భాగస్వామి కూడా అలాగే ఉండాలని ఆశిస్తున్నా. అంతేకాదు.. అతని కుటుంబం కూడా నా కుటుంబంలాగే మారాలని కోరుకుంటున్నా!" అంటూ.. ఫ్యామిలీ ఎమోషన్స్ గురించి చెప్పుకొచ్చింది. పాతకాలం నాటి సాంప్రదాయ ప్రేమకథలంటే తనకు ఎంతో నమ్మకమనీ.. అదే తాజా సినిమాలో తాను పోషించిన రూమీ పాత్రకు తనను మరింత దగ్గర చేసిందనీ అంటున్నది. అనన్య మాటలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు నెటిజన్లు.. అనన్య పాండేపై వచ్చిన డేటింగ్ రూమర్స్‌ను గుర్తుచేస్తున్నారు. ఇషాన్ ఖత్తర్, కార్తిక్ ఆర్యన్, ఆదిత్యరాయ్ కపూర్ వంటి స్టార్లతో డేటింగ్ ముచ్చట్ల గురించీ చెప్పాలని కామెంట్లు పెడుతున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు చుంకీ పాండే కూతురైన అనన్య.. హిందీ పరిశ్రమలో అత్యంత పాపులర్ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నది.

# అఖిల్ 'లెనిన్'పై కీలక అప్‌డేట్.. న్యూ ఇయర్ ఫస్ట్ సింగిల్?



అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'లెనిన్' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వినరో భాగ్యం విష్ణుకథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌తోనే అఖిల్ ఈ సినిమాలో విభిన్నమైన మాస్ పాత్రలో కనిపించబో తున్నాడని క్లారిటీ ఇచ్చారు మేకర్స్. అయితే ఆ తర్వాత సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ రాకపోవడంతో షూటింగ్ స్టేటస్, రిలీజ్ టైమ్‌లైన్‌పై అభిమానుల్లో సందేహాలు నెలకొన్నాయి. సోషల్ మీడియాలోనూ ఏదొక అప్‌డేట్ ఇవ్వాలని అక్కినేని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాత నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. అడగకుండానే మాట్లాడిన ఆయన, మరికొద్ది రోజుల్లోనే 'లెనిన్' ఫస్ట్ సింగిల్ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు. అంతేకాదు, సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వస్తోందని, వచ్చే ఏడాది మార్చిలో మూవీని విడుదల చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. నాగవంశీ వ్యాఖ్యలతో అక్కినేని అభిమానుల్లో జోష్ పెరిగిపోయింది. నిర్మాత మాటల్ని బట్టి చూస్తే అఖిల్ కెరీర్‌లో ఇదే ఫస్ట్ బ్లాక్‌బస్టర్ అవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని అంచనాలు వినిపిస్తున్నాయి. మరి ఈ రెండు మూడు రోజుల్లో 'లెనిన్'కు సంబంధించిన అధికారిక ప్రకటన వస్తుందా? అఖిల్ నుంచి మాస్ సర్ప్రైజ్ ఎప్పుడు వస్తుందో చూడాలి. కాగా, అఖిల్ కెరియర్‌లో ఇప్పటి వరకు మంచి హిట్ ఒక్కటి లేదు. పెళ్లి తర్వాత అఖిల్ నుండి వస్తున్న తొలి చిత్రం ఇదే కాగా, ఈ మూవీతో మనోడు మంచి హిట్ దక్కించుకుంటాడా, అక్కినేని ఫ్యాన్స్‌కి న్యూ ఇయర్‌లో మంచి ట్రీట్ ఇస్తాడా అనేది చూడాలి.



# అక్షయ్‌కు రెండు డిమాండ్స్.. అందుకే 'దృశ్యం 3' నుంచి అవుట్!

థ్రిల్లర్ మూవీ 'దృశ్యం' సూపర్ డూపర్ హిట్టు. దర్శకుడు జీతూ జోసెఫ్, హీరో మోహన్‌లాల్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ భాషల్లో రీమేక్ అయి అక్కడా ఘన విజయాన్ని అందుకుంది. దీంతో 'దృశ్యం' ఫ్రాంచైజీలో రెండవ భాగాన్ని తీసుకొచ్చారు. కాకపోతే 2021లో కరోనా వల్ల మలయాళ వర్షన్‌ను ఓటీటీలో రిలీజ్ చేశారు. ఓటీటీలో కూడా మంచి రెస్పాన్స్ రావడటంతో తెలుగు, హిందీలో రీమేక్ చేశారు. వెంకటేశ్ 'దృశ్యం 2' కూడా అదే ఏడాది ఓటీటీలో విడుదలైంది. అయితే అజయ్ దేవ్‌గణ్ హిందీ 'దృశ్యం 2' మాత్రం 2022లో బాక్సాఫీస్ ముందుకు వచ్చింది. రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సంచలన విజయాన్ని సాధించింది. ఇప్పుడు' దృశ్యం' మూడో పార్ట్ రాబోతోంది. మోహన్‌లాల్– జీతూ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు హిందీలో అజయ్ దేవ్‌గణ్ 'దృశ్యం 3' షూటింగ్ ఇటీవలే మొదలైంది. టబు, శ్రియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అభిషేక్ పాఠక్ డైరెక్టర్. ఈ మూవీ 2026 అక్టోబర్ 2న విడుదల కానుంది. అయితే ఈ సినిమా నుంచి ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈయన 'దృశ్యం 2'లో పోలీసాఫీసర్‌గా కనిపించారు.